క్లుప్తంగా

ఆశా వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ముండ్లమూరు (దర్శి): జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మండలంలోని పులిపాడు, శింగన్నపాలెం గ్రామాల్లో ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ముండ్లమూరు వైద్యాధికారి మల్లెల జాస్మిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రీషన్ కమిటీ తీర్మానం ప్రకారం దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి పంపడం జరుగుతుందన్నారు. పదో తరగతి పూర్తి చేసి చదవడం, రాయడం వచ్చిన 25 నుంచి 45 ఏళ్లలోపు వివాహితలు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ముండ్లమూరు ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

కుటుంబాన్ని దత్తత తీసుకున్న అధికారులు



విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

కురిచేడు: బంగారు బాల్యం కార్యక్రమం కింద కురిచేడులోని పోలేరమ్మ ఆలయం వద్ద సత్రంలో నివసిస్తున్న ఒక కుటుంబాన్ని ఎంపీడీఓ కేజీఎస్ రాజు, ఎంఈఓ వస్త్రాంనాయక్ దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబంలో ఉన్న ఐదుగురు చిన్నారుల్లో ముగ్గురిని ఉర్దూ పాఠశాలలో చేర్పించి వారికి యూనిఫాం, షూ, పుస్తకాలు అందజేశారు. మరో ఇద్దరిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. ఆ కుటుంబానికి సంబంధించి ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, నివాస స్థలం, నివాస గృహం ఏర్పాటు చేయిస్తానని ఎంపీడీఓ తెలిపారు.

దొనకొండ నూతన వైద్యాధికారిగా ప్రశాంత్‌కుమార్



దొనకొండ: దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా ఎస్.ప్రశాంత్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయిబాబా జిల్లా డీఎం కార్యాలయం నుంచి దొనకొండకు బదిలీపై ఆయన వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు మొదలయ్యాయని, గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు సిబ్బందితో కలిసి పనిచేస్తామని తెలిపారు.

ఆడపిల్లలు జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

దర్శి: యుక్త వయస్సులో ఆడపిల్లలు జాగ్రత్తలు పాటించాలని సీఐ రామారావు సూచించారు. స్థానిక కేజీ బీవీ పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉన్న పిల్లలు మగవారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. పురుషులు మీతో నడుచుకునే విధానాన్ని వెంటనే ఇంట్లో తెలియజేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మురళి, ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ఎన్ లక్ష్మీనారాయణ

పెద్దారవీడు: పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ఎన్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో ఏనుగులదిన్నెపాడు, రాజంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అలాగే గులాబీ పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, తద్వారా తగిన మోతాదులో ఎరువుల వాడకంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి కంది, సజ్జ, పత్తి, ఎండ మిరప, మినుములు, నూగు పంటలకు ఈనెల 31వ తేదీలోపు, వరి పంటకు ఆగస్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్ నాయక్, వీఏఏ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మిర్చి సాగుపై పునరాలోచన

- ఈ ఏడాది పంట కోల్డ్ స్టోరేజిలోనే నిల్వ ఉంచిన రైతులు
- గిట్టుబాటు ధరలేని ఎండు మిరప
- అమ్ముకుంటే కూలి డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన
- ఖరీఫ్‌లో మళ్లీ మిర్చి సాగుకు రైతుల వెనుకంజ



ఎండు మిరప కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

పెద్దారవీడు: పశ్చిమ ప్రాంతంలో ఏటా బోర్ల కింద రైతులు మిరప పంట ఎక్కువ శాతం సాగు చేస్తుంటారు. అయితే ఈ సంవత్సరం మిరప సాగుపై రైతులు పునరాలోచన చేస్తున్నారు. ఎంతో కష్టపడి చెమటోడ్చి పంట పండించి తర్వాత వచ్చిన దిగుబడులతో సరైన గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులకు సైతం నోచుకోలేక రైతులు కుదేలైపోతున్నారు. గ్రామాల్లో వాణిజ్య పంట మిరపను రైతులు గతేడాది విరివిగా సాగు చేశారు. ఒక వైపు పంట సాగుకు పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోతున్నా మిర్చి ధరలు మాత్రం రోజు రోజుకూ దిగజారుతున్నాయి. మిర్చి గతేడాది క్వింటా రూ.20 వేల నుంచి రూ.22 వేలు పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో గ్రామాల్లో అధిక సంఖ్యలో ఒక్కో రైతు 5 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేశారు. కానీ ఆశించిన మేర దిగుబడి రాకపోవడం ఒక ఎత్తైతే ప్రస్తుతం ఉన్న ధరలు పూర్తిగా రైతులకు నిరాశలోకి నెట్టేశాయి. తేజ రకం మిరప మాత్రం ధర కాస్త ఆశాజనకంగా ఉన్నప్పటికీ అందుకు అయిన ఖర్చులు కూడా ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. గతేడాది కూలి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు ఇచ్చి కోత చేయించుకుంటే అందుకు సంబంధించిన కూలి డబ్బులు కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎండు మిరప కాయలు ఇప్పటికీ కోల్డ్ స్టోరేజిలో నిల్వ ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజి యజమానులు ఫోన్ చేసి త్వరగా అమ్ముకోమని ఒత్తిడి చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ ధరలో అమ్ముకుంటే భారీగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు పంటకు పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని గత్యంతర లేని పరిస్థితిలో అమ్ముకోవాల్సి వస్తోంది. గతేడాది ఒక్కో రైతు మిరప పంట 6 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేశారు. పంటల పిచికారి కోసం రసాయన మందులు, ఎరువులు అప్పుగా ఇచ్చిన వ్యాపారులు డబ్బులు కట్టాలంటూ రైతుల ఇళ్ల చుట్టూ తిరుగుతుండటంతో ఏం చేయాలో వారికి దిక్కుతోచడం లేదు. ఈ ఏడాది 1 నుంచి 2 ఎకరాలు సాగు చేయడం కూడా కష్టతరంగా ఉంది. ఏది ఏమైనా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైనా మిరప పంట సాగు కోసం రైతులు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది మిరప పంట సాగు తగ్గితే మాత్రం కూలీలకు పనులు కరువయ్యే అవకాశం ఉంది. వర్షాభావానికి తోడు, మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడమే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడానికి కారణమని రైతులు చెబుతున్నారు.

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ



మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

- సమావేశానికి డుమ్మా కొట్టిన ఎంపీడీఓ
- గత సమావేశంలో తీర్మానాలేవీ అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ సభ్యుల నిరసన

యర్రగొండపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు బహిష్కరించారు. పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షతన జూలై 2వ తేదీ జరుగుతుందని, ఎంపీటీసీ సభ్యులతోపాటు సర్పంచ్‌లు, అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని ఎంపీడీవో బి.శ్రీనివాసులు గత నెల 23వ తేదీ నోటీసులు జారీ చేశారు. గత సమావేశంలో జరిగిన తీర్మానాలు ఎంతవరకు అమలయ్యాయి, ప్రస్తుతం ప్రజలకు ఉపయోగపడే అంశాలపై సమావేశంలో చర్చించాల్సి ఉంది. అందుకు తగిన సమాధానం ఇవ్వాల్సిన ఎంపీడీవో సమావేశానికి డుమ్మా కొట్టడంతో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, మరో 9 మంది ఎంపీటీసీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం జనవరి 10వ తేదీ జరిగిన సమావేశంలో తీర్మానించి ఆమోదించిన 12 అంశాల్లో ఏ ఒక్క అంశాన్ని ఎంపీడీవో అమలు చేయలేదని, ఈ విషయంపై మండల పరిషత్ సమావేశంలో నిలదీస్తామన్న భయంతో ఆయన సమావేశానికి హాజరు కాలేదని వారు ఆరోపించారు. కొత్తపల్లి శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, పిల్లికుంట తండా నుంచి చెంచుకాలనీకి రోడ్డు వేసేందుకు రూ.5 లక్షలు, కొలుకుల ఎస్సీ పాలెం, మొగుళ్లపల్లె, తమ్మడపల్లె, గోళ్లవిడిపి వైపాలెంలోని ఉట్లస్తంభాల వీధి, గురిజేపల్లి ఎస్సీ పాలెం, గుర్రపుశాల, ఇజ్రాయిల్‌పేటలలో తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ.23 లక్షలు, గంజివారిపల్లె నుంచి సాయిబాబా నగర్‌కు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, వీరభద్రాపురం జిల్లా పరిషత్ స్కూల్ నుంచి గంజివారిపల్లె రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసేందుకు సమావేశం తీర్మానించిందని, ఆ పనుల్లో ఏ ఒక్కటి ఇప్పటి వరకు జరగలేదని వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు ఆరోపించారు. అభివృద్ధి పనులకు ఎంపీడీవో మొఖం చాటేయటమేంటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో బుధవారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. రండి బాబూ రండి.. మీ ఇంటికే మద్యం వచ్చింది అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఆరవల్లిపాడు, రుద్రసముద్రం గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలను నిరోధించడంలో భాగంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఆరవల్లిపాడు గ్రామానికి చెందిన మాచర్ల అనే వ్యక్తి 19 మద్యం సీసాలతో బెల్టు షాపు నిర్వహిస్తుండగా, కేసు నమోదు చేశారు. అదే విధంగా దర్శి మండలం చందలూరు గ్రామానికి చెందిన స్వామి అనే వ్యక్తి దొనకొండ నుంచి రుద్రసముద్రం వెళ్లే రైల్వే బ్రిడ్జి వద్ద బెల్టుషాపు నిర్వహణకు 15 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా, కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

మండలంలో గత 7 నెలల కాలంలో 29 బెల్టు షాపులపై కేసులు నమోదు చేశారు. రుద్రసముద్రం గ్రామంలో ఇప్పటి వరకు ఏడుగురిపై బెల్టుషాపుల కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది కాశింపీరా, ఎస్.శ్రీనివాసులు, సీహెచ్ సాయిబాబా, ఏ శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, పట్టుబడిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

పత్తిపై సస్యరక్షణ చర్యలు చేపట్టండి

యర్రగొండపాలెం: పత్తి పంటపై రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఎక్కువగా కనిపిస్తుందని, వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి తమ పంటను కాపాడుకోవాలని ఏవో కె.నీరజ అన్నారు. మండలంలోని గోళ్లవిడిపి, కొలుకుల గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంట 20 నుంచి 30 రోజుల్లో ఉందని, ఈ సమయంలో రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఎక్కువగా కనిపిస్తోందని, దీని నివారణకు తొలిదశలో వేప నూనె పిచికారి చేసుకోవాలని ఆమె సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే అసెటామిప్రిడ్ లీటరు నీటిలో 2 మిల్లీలీటర్లు కలిపి పంట బాగా తడిసేలా పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు టి.పాపయ్య, డి.ధనేశ్వర్ నాయక్, వీఏఏ పెద్ద మస్తాన్, ఎంపీఈవో పార్వతిబాయి పాల్గొన్నారు.

కౌలు రైతులకు భూ యజమానులు సహకరించాలి

దర్శి: కౌలు రైతులకు భూ యజమానులు సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ నాగమణి అధ్యక్షతన బుధవారం పంట సాగు చట్టంపై ప్రచార ఉద్యమం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కౌలు కార్డులపై ప్రతి కౌలు రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ యజమానులకు ఎటువంటి నష్టం లేకుండా సాగుదారుల చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న ఏఓ రాధ

దర్శి: కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఓ కే రాధ సూచించారు. మండలంలోని పోతవరం, దేవవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పొలాలను సందర్శించి పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. రాధ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇన్సూరెన్స్‌కు కందికి రూ.430 బీమా చెల్లిస్తే రూ.21500ని బీమా కంపెనీలు చెల్లిస్తాయని చెప్పారు. వరికి రూ.860 చెల్లిస్తే రూ.43 వేలు బీమా కంపెనీలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు రవీంద్ర, విష్ణు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలి



వైద్యాధికారి రవితేజకుమార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు

కురిచేడు: కార్మికుల హక్కులను రక్షించుకోవడం కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులందరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పిలుపునిచ్చారు. కురిచేడు మండల కేంద్రంలో బుధవారం స్కీం వర్కర్లు అయిన అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం పథకం, ఆశా కార్యకర్తలు, పంచాయతీ, ముఠా, బిల్డింగ్ కార్మికులకు ప్రచార కరపత్రాలు, బుక్‌లెట్లు పంపిణీ చేసి జనరల్‌బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి కార్మిక, ఉద్యోగులకు నష్టం కలిగించే 4 కార్మిక కోడ్ బిల్లులను తీసుకొస్తోందని తెలిపారు. ఈ బిల్లులను వెంటనే రద్దుచేయాలని సమ్మె ద్వారా పోరాటం చేస్తున్నామన్నారు. యాజమాన్యాలకు సంపద సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 8 గంటల పనివిధానాన్ని 10 గంటలకు పెంచాలని నిర్ణయించటం దుర్మార్గమని విమర్శించారు. ప్రపంచంలో పెద్ద ఎత్తున శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ కాలంలో కార్మికులకు పని గంటలు తగ్గాలని, వేతనాలు పెరగాల్సి ఉండగా డబుల్ ఇంజిన్ సర్కార్లు రెండు కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. పెద్ద పెద్ద కంపెనీలకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేదలు, కార్మికులు, రైతులు, మధ్య తరగతి ప్రజల జీవితాలలో మార్పురావటం లేదన్నారు. మరోవైపు 6 శాతం కార్పొరేట్ శక్తుల వద్ద దేశ సంపద 60 శాతం పోగుపడిందని అన్నారు. పేద ప్రజలైన 70 శాతం ప్రజల వద్ద 4 శాతం కూడా సంపద లేదని వివరించారు. అనంతరం ఆశా కార్యకర్తలు వైద్యాధికారికి, పంచాయతీ కార్మికులు కార్యదర్శి చాంద్‌బీకి సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, సీఐటీయూ నాయకులు షేక్ ఫాతిమా, పార్వతి, విజయరాణి, రంగమ్మ, అశోక్, జార్జ్, సాల్మన్, ఖాదర్‌బీ, నాగమణి, మాబులా, ముంతాజ్‌బేగం, కే రామారావు, శ్రీనివాసరావు, ఫణీంద్రకుమార్, రాజు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల అరెస్ట్ పిరికి చర్య

- విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి



దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి (ఫైల్)

దర్శి: వైద్య విద్యార్థుల అరెస్ట్ పిరికి పందల చర్య అని విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైద్యుల దినోత్సవం రోజు యువ వైద్యులను అరెస్ట్ చేసి కూటమి ప్రభుత్వం ఘోరంగా అవమానించిందని మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కారం చేయాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ దగ్గర నిరసన తెలియజేస్తున్న వైద్య విద్యార్థులను పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. వైద్య విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు కూటమి పాలకుల మాటలు ఉన్నాయని ధ్వజమెత్తారు. వైద్య విద్యార్థుల కోసం వైఎస్సార్ సీపీ గొంతు వినిపిస్తుందని, వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

భర్త అనుమతితోనే కు.ని ఆపరేషన్ చేశాం



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ యాదిద్యా

- సూపరింటెండెంట్ యాదిద్యా

యర్రగొండపాలెం: కాన్పునకు వచ్చిన పేషెంట్ భర్త, కుటుంబ సభ్యుల అనుమతితోనే కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేశామని స్థానిక 100 పడకల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్యా అన్నారు. కాన్పు కోసం వెళ్తే కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేశారని పలు దిన పత్రికల్లో వచ్చిన వార్తను ఆయన ఖండించారు. ఈ మేరకు బుధవారం వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న నరసాయపాలెంకు చెందిన పులుకూరి రిష్త మంగళవారం 108 వాహనంలో వచ్చి వైద్యశాలలో చేరిందని, ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే ఆపరేషన్ ద్వారా కాన్పు చేయాల్సి వచ్చిందన్నారు. ఆ తరువాత పేషెంట్ గర్భసంచిలో ఇన్ఫెక్షన్ చోటు చేసుకోవడం వలన కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయటానికి డ్యూటీలో ఉన్న డాక్టర్లు నిర్ణయానికి వచ్చారని ఆయన తెలిపారు. తొలి కాన్పు కూడా క్రిటికల్‌గా ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీశారని, రెండు కాన్పులు ఆపరేషన్ చేయడం వలన పేషెంట్ పరిస్థితి బాగుండటంలేదన్న విషయాన్ని ఆపరేషన్ థియేటర్ బయట ఉన్న పేషెంట్ భర్త అమోషి, కుటుంబ సభ్యులకు వివరించి వారి అనుమతితో అన్ని ప్రోటోకాల్స్‌ను అనుసరించి కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేశారని ఆయన తెలిపారు. ఆపరేషన్ పూర్తయిన తరువాత పేషెంట్ కుటుంబ సభ్యులు తమకు తెలియకుండా ఆపరేషన్ చేసినట్లు ఫిర్యాదు చేశారని, వారు అవసరం అనుకుంటే నిపుణులతో బిడ్డలు పుట్టే రీక్యానలైజేషన్ ఆపరేషన్ చేయిస్తామని ఆయన తెలిపారు. ప్రతి నెలా వైద్యశాలకు 150 డెలివరీ కేసులు వస్తున్నాయని, వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి ప్రతి పేషెంట్‌తోపాటు వారివెంట వచ్చిన వారితో డాక్టర్లు చర్చించిన తరువాతనే డెలివరీ ఆపరేషన్‌లు చేస్తారని అన్నారు. సమావేశంలో డాక్టర్లు శివానంద, లత పాల్గొన్నారు.

మొక్కజొన్నలో జింక్ లోపాన్ని నివారించండి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్, రైతులు

కురిచేడు: మొక్కజొన్న పంటలో జింక్ లోపం కనిపిస్తోందని, దాని నివారణకు జింక్ సల్ఫేట్ 400 గ్రాములను ఎకరా పంటకు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం కురిచేడులో సాగుచేసిన మొక్కజొన్న, దోస పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగును గమనించి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 4 కిలోలు వేయాలని లేదా ఏమామేక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను ఎకరా పంటలో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం నాగభూషణం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జుననాయక్, రైతులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు డీకేయం రఫి

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండల సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశం మండల కేంద్రంలోని యూటీయఫ్ కార్యాలయంలో సిఫోరా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేయం.రఫి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సోమయ్య, సీఐటీయూ మండల నాయకులు అరుణ్, కాశయ్య, బాబూరావు, ప్రావీణ్య, రాణి, కోటేశ్వరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సుపరిపాలనలో తొలిఅడుగు

దర్శి: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు మండలంలో తొలి రోజు నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. తొలిరోజే గొట్టిపాటి లక్ష్మి గైర్హాజరయ్యారు. పట్టణంలోని 18వ వార్డు, మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో తొలిరోజు నిర్వహించిన కార్యక్రమానికి స్పందన కరువైంది. సూపర్ సిక్స్ పూర్తి స్థాయిలో అమలు చేయకపోయినా ఇంటింటికీ వెళ్లి ఏమని అడగాలని నాయకులు లోలోన మదనపడుతున్నారు. చంద్రబాబు అన్ని పథకాలు అమలు చేస్తే ధైర్యంగా గ్రామాల్లోకి వెళ్లవచ్చుగానీ.. సంవత్సరం గడిచినా పథకాలు అమలు చేయకుండా ఇంకా అవి చేస్తాం.. ఇవి చేస్తాం అని ప్రజలను ఎలా నమ్మించాలా అని నాయకులు, కార్యకర్తలు నైరాశ్యంలో ఉన్నారు. దీంతో ఆ పార్టీకి చెందిన వారి నివాసాలకు మాత్రమే వెళ్లి టీడీపీ కరపత్రాలిచ్చి చేతులు దులుపుకున్నారు. ఇదిలా ఉండగా, కూటమిలోని బీజేపీ, జనసేన ప్రధాన నాయకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం గమనార్హం. ప్రజలు ప్రశ్నిస్తే చంద్రబాబు చేసిన తప్పులకు తమ పార్టీలు ఏమని సమాధానం చెప్పాలనుకున్నారో.. ఏమోగానీ ఆ రెండు పార్టీల నాయకులు పక్కకు తప్పుకున్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో లు ఇందిర, ఎండీ ఖాసిం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలను బుధవారం ఎంఈవోలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఎండీఎంలను తనిఖీ చేసి మాట్లాడుతూ విద్యార్థుల్లో ముఖ్యంగా సామర్థ్యాలను పెంచడంతో రాయడం, చదవడం నేర్పించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పూర్ణయ్య తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు